క్లుప్తంగా

ఏకేయూలో విద్యార్థులకు పోటీలు



వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు సిటీ:

79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ ఏ భారతీదేవి సంయుక్త ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, జాతీయ ఉద్యమం, తదితర అంశాలపై ముగ్గుల పోటీలు, పాటల పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణి, డాక్టర్ భారతీదేవి, డాక్టర్ అమృతవల్లి దేవి, డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ వ్యవహరించారు. పోటీల్లో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఆక్వాకల్చర్, ఎంబీఏ, కంప్యూటర్ సైన్స్ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీ ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలోని సమావేశపు హాలులో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవంలో వీసీ ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను తిలకించారు.

ఒంగోలులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు సబర్బన్:

నగరంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. లాయర్‌పేటలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించగా, మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు కొనసాగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమ్మి నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాకినేని అమరసింహం, తిరంగా యాత్ర ఇన్చార్జి పి.దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

అణచివేత చర్యలకు చంద్రబాబు సిగ్గుపడాలి

- ప్రజాసంఘాల నాయకుల మండిపాటు
- క్విట్ కార్పొరేట్-క్విట్ అగ్రికల్చర్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై ఆగ్రహం



రైతు సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై శాంతియుతంగా నిర్వహిస్తున్న ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని, ప్రజా స్వామ్యవాదులపై అణచివేత చర్యలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇందుకు సిగ్గుపడాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు విమర్శించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా కిసాన్ సంయుక్త మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో చేపట్టిన క్విట్ కార్పొరేట్, క్విట్ అగ్రికల్చర్ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. జాతీయ జెండాలతో స్థానిక మినీ స్టేడియం వద్దకు చేరుకున్న రైతులు, కార్మికులు ర్యాలీ నిర్వహించకుండా పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకు-నాయకులకు మధ్య కాసేపు వాదన జరిగింది. 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీ చేయడానికి వీలులేదని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో ర్యాలీకి బదులుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా నిర్వహిస్తున్న ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం దుశ్చర్యగా అభివర్ణించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని చెప్పారు. నేరస్తులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు ప్రజాస్వామ్యవాదులపై ఉక్కుపాదం మోపుతున్నాయని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ రెండు లక్షల ఎకరాల సాగు భూములను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వం.. అదే భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకుని లక్షల కోట్లు ఎగ్గొట్టిన మోసగాళ్లకు సంబంధించి 16 లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేసిందని ధ్వజమెత్తారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోందని మండిపడ్డారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులను పంపించి అణచివేయాలని ప్రయత్నించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి మాట్లాడుతూ డేరా బాబా వంటి నేరస్తుడికి 40 రోజుల్లో పెరోల్ ఇచ్చారని, కానీ, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తున్న ప్రజా సంఘాలపై ఉక్కుపాదం మోపడం దుర్మార్గమని అన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం.. కార్పొరేట్లకు అప్పగించి కుట్రలకు పాల్పడడాన్ని తిప్పికొడతామన్నారు. డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ప్రతిపక్షాల గొంతునొక్కుతున్నారని మండిపడ్డారు. ధర్నాలో రైతు నాయకులు సుబ్బారెడ్డి, భీమవరపు సుబ్బారావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, టి.శ్రీకాంత్, కనపర్తి సుబ్బారావు, రమేష్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశువులను కాపాడాలి

- రిజిస్టర్ అయిన ప్రతి స్కాన్ సెంటర్‌ను విధిగా తనిఖీ చేయాలి
- చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్న స్కాన్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి
- పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ విధిగా అమలు చేయాలి
- జిల్లా స్థాయి సమావేశంలో డీఆర్‌ఓ ఓబులేసు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు సబర్బన్: గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైద్యారోగ్య శాఖాధికారులను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) బీసీహెచ్ ఓబులేసు ఆదేశించారు. స్థానిక డీఆర్‌ఓ చాంబర్‌లో బుధవారం జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను విధిగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని రిజిస్టర్ స్కాన్ సెంటర్లను విధిగా తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నామన్నారు. చట్టానికి వ్యతిరేకంగా స్కాన్ సెంటర్లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న చట్టానికి సంబంధించిన అన్ని విషయాలను సమావేశంలో వివరించారు. జిల్లాలో అన్ని స్కాన్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆచరణ ప్రణాళిక ప్రకారం తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా స్కాన్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు తమకు తెలిసిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యారోగ్యశాఖ, మహిళ, శిశు సంక్షేమశాఖ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని డీఆర్‌ఓ ఆదేశించారు. సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవసరమైన పోస్టర్లు, ఫ్లెక్సీలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలని వివరించారు. ముఖ్యంగా ట్రైబల్ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, సార్స్ ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధి డాక్టర్ లక్ష్మి, డాక్టర్ నబీవల్లి, జిల్లా మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామంలో ఏకలవ్యనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దేవరకొండ పెద్ద సుబ్బారావు సతీమణి సంతోషమ్మ, ఏకలవ్యకాలనీ వాసుల ఆహ్వానం మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకి కాలనీ వాసులు పూలతో ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. నూతన గృహంలో సత్యనారాయణ స్వామి వారికి బూచేపల్లి కొబ్బరికాయ కొట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టీటీడీ ఆధ్వర్యంలో ఏకలవ్య వాసుల కులదైవం అంకమ్మ తల్లి దేవస్థానం నిర్మించారు. అయితే నిర్మాణం కొంతమేరకు మిగిలిపోవడంతో ఆ పనులు పూర్తి చేసేందుకు సహకరిస్తానని, కాలనీ వాసుల కల నెరవేరుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. బూచేపల్లి వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జగన్నాథం సురేష్, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు యత్తపు మధుసూదన్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, గోపు శ్రీను, నారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, మధు, ప్రశాంత్, సూరిబాబు, రామయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మల్లవరం దేవస్థానానికి పవిత్రాల సమర్పణ



పవిత్ర మాలలు సమర్పిస్తున్న శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

ఒంగోలు మెట్రో: మల్లవరం వెంకటేశ్వరస్వామికి ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి బుధవారం శ్రీగిరి దేవస్థానం పక్షాన పవిత్రాల మాలలు సమర్పించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు నారాయణం వెంకటాచార్యులును సత్కరించారు. శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం, మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి నడుమ సుదీర్ఘ కాలంగా ఆధ్యాత్మిక పరంగా ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తు చేశారు. శ్రీగిరి దేవస్థానం పక్షాన మల్లవరం వెంకటేశ్వర స్వామికి పవిత్రాల మాలలు సమర్పించిన ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులకు మల్లవరం దేవస్థానం ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మల్లవరం దేవస్థానం అర్చకుడు నారాయణం రాజశేఖరాచార్యులు, శ్రీగిరి దేవస్థానం ప్రధాన అర్చకుడు ప్రద్యుమ్న కుమార్, అర్చకులు రంగస్వామి అయ్యర్, వేద పండితులు పి.భానుప్రకాశశర్మ, శనగవరపు రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానానికి 15 మంది అంగీకారం



అవయవ దానానికి అంగీకరించిన వారితో రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: ప్రపంచ అవయవ దానం దినోత్సవం సందర్భంగా చీమకుర్తిలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో 15 మంది తమ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు.

చంద్రబాబుది తుగ్లక్ పాలన

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్‌కు చైర్మన్ నియామకం చంద్రబాబు తుగ్లక్ పాలనకు నిదర్శనమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు డి.అంజయ్య బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే మాల కార్పొరేషన్‌కు జనసేన కోటాలో బాపట్ల జిల్లాకు చెందిన పెదపూడి విజయకుమార్‌ను చైర్మన్‌గా నియమించగా, మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌గా టీడీపీకి చెందిన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని నియమించారన్నారు. అదేవిధంగా ఈ కార్పొరేషన్లకు విడివిడిగా డైరెక్టర్లను కూడా నియమించారన్నారు. కానీ, 2024-25లోగానీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లోగానీ ఒక్క రూపాయి కూడా రుణాలు మంజూరు చేయలేదన్నారు. మాల, మాదిగ కార్పొరేషన్లకు విడివిడిగా చైర్మన్లు, డైరెక్టర్ల నియామకం తర్వాత ఇప్పుడు ఎస్సీ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించడం ఏంటని ప్రశ్నించారు.

తీరంలో అప్రమత్తం



ఒడ్డుకు చేరిన బోట్లు



ముందుకొచ్చిన సముద్రం

కొత్తపట్నం: మూడు రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కొత్తపట్నం సముద్ర తీరంలో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. బోట్లు, ఇంజిన్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సముద్రంలో వేటకు వెళ్లిన వారంతా ఒడ్డుకు చేరారు. సముద్రంలో లంగర్లు వేసిన బోట్లను ఇంజన్ల సహాయంతో మెరక ప్రాంతానికి చేర్చారు. అలలు ఎగసిపడుతూ సముద్రం కొంచెం ముందుకు వచ్చింది. సముద్ర స్నానానికి వచ్చే యాత్రికులను మెరైన్ పోలీసులు లోనికి వెళ్లనీయకుండా అదుపు చేశారు. మత్స్యకారులు మూడు రోజుల పాటు వేటకు వెళ్లవద్దని అధికారులు మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. ఎటువంటి ప్రాణం నష్టం జరగకుండా సురక్షిత ప్రాంతాలకు చేరాలని మత్స్యకారులను ఆదేశించారు. ముందుస్తుగా తుఫాన్ షల్టర్‌ను బాగు చేయించి సిద్ధం చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, పోలీసు పరేడ్ గ్రౌండులో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం సాయంత్రం అధికారులతో కలిసి పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఆయా శాఖల అధికారులకు వారు నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధులను సమన్వయం చేసుకుంటూ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు గౌరవ వందనం, కవాతు, తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు సిట్టింగ్ ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య సమర యోధులను గుర్తించి వారి వివరాలను సిద్ధం చేయాలన్నారు. దేశభక్తి చాటిచెప్పే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున కార్యక్రమానికి ఎలాంటి ఆటంకం కలగకుండా రెయిన్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులకు అందించే ప్రశంసపత్రాల విషయంలో సమయం వృథా కాకుండా ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో కూడిన శకటాలు, స్టాళ్ల ప్రదర్శన ఉండాలని చెప్పారు. జిల్లా ప్రగతిని సూచించేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, జాన్సన్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, డీఈఓ కిరణ్ కుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ రవికుమార్, డీడీ మైన్స్ రాజశేఖర్, జిల్లా ఉద్యాన వన శాఖాధికారి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.